

ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించాలి...



ప్రజాశక్తి - పెదబయలు: మండలంలోని గోమంగి పంచాయతీ గోమంగి ఉపాధి హామీ కూలీలకు టెంటు, మంచినీరు, మజ్జిగ, మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు అధికారులు ఏర్పాటు చేయాలని కల్పించాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు జంపరంగి సునీల్ కుమార్ ఆదివారం మాట్లాడుతూ, ఉపాధి కూలీలకు గతంలో కంటే అధికంగా చెల్లించాలన్నారు. ఆదివారికి రోజుకు రూ.350, మగవారికి రోజుకి రూ.500 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ కూడా మత్స్యకొండ బాబు, కూడా లాలిబాబు, ప్రసాదరావు, కళ్యాణం కూడా మహేష్ బాబు, కుంబిడి వెంకటరమణ మహిళలు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ప్రయాస

- ఎండలకు ఎండుతున్న ఊటగెడ్డలు - కొండలు దాటి వెళ్తున్న గిరిజన మహిళలు

ప్రజాశక్తి -అనంతగిరి: మండుతున్న ఎండలకు ఊట గెడ్డలు సైతం అడుగంటి పోతున్నాయి. తాగునీటి కోసం మారుమూల పల్లెల్లో గిరిజన ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇబ్బందులు పడుతు కొండలు దాటి వెళతున్నారు. జల్ జీవన్ పథకం ద్వారా తాగునీటి ఎద్దడి తీర్చేందుకు వేల కోట్లు నిదులు కేటాయిస్తున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలకే పరిమితం అవుతున్నాయి తప్ప ఆచరణలో అమలు కాలేదు.

మండలంలోని నాన్ షెడ్యూల్ రొంపల్లి పంచాయతీ పరిధి గూడెం గ్రామంలో దాహం కేకలతో ఆదివాసీలు అలమటిస్తున్నారు. ఈ గ్రామంలో 120 జనాభా నివసిస్తున్నారు. గ్రామ ప్రజలు తాగునీటి కోసం సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఎత్తైన కొండ కోనలు దాటి చిన్న పాటి ఊటల్లో నీటిని సేకరిస్తున్నారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో ఊట ధార అట్టడుగుకు ఇంకిపోయింది. బిందెడు నీటి కోసం రోజంతా ఊరిన నీటిని సేకరించే పనిలో మహిళలు నిమగ్నం అవుతున్నారు. బావి, పైపులైన్, బోరు వంటి పథకాలు గ్రామంలో ప్రభుత్వం నేటికీ మంజూరు చేయక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. ఊట గెడ్డ తప్ప మరో ఆధారం లేదని, కొన్ని సార్లు కలుషితం అవుతున్న ఈ నీటినే తాగాల్సి రావడంతో పలు రకాల వ్యాధుల బారిన పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. తక్షణమే తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు

ఇదిలా ఉండగా స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ళు గడుస్తున్నప్పటికీ చీకటిలోనే జీవనం కొనసాగిస్తున్నారు గూడెం గ్రామ ప్రజలు. కనీసం విద్యుత్ సౌకర్యం లేక ఆయా గ్రామాల ప్రజలు రాత్రి సమయంలో బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. దట్టమైన అటవీ ప్రాంతం, ఆపై ఎత్తైన కొండ శిఖరు కావడంతో రాత్రి పూట ఏ సమయంలో ఎటువైపు నుండి విషపూరిత మైన జంతువులు ప్రవేశిస్తాయోనన్న భయాందోళనలతో గడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యలు పరిష్కరించాలని ఆ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



ఊట గెడ్డలో నీటిని తోడుకుంటున్న గిరిజన మహిళలు



ఊట గెడ్డ నుంచి నీటిని బిందెలతో మోసుకుని వెళుతున్న గిరిజన మహిళలు

మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ కాపీలు దగ్ధం



పాడేరులో ఆందోళన చేపడుతున్న స్పెషన్ డిఎస్‌సి సాధన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - పాడేరు :- ఆదివాసి ప్రాంతంలో తక్షణమే స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జీవో కాపీలను ఆదివారం స్థానిక పీఎంఆర్సి వద్ద సాధన కమిటీ ఆధ్వర్యంలో దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ చేపట్టిన దశల వారి ఉద్యమంలో భాగంగా ఆదివారం పలు

మండలాల్లో ఆదివాసీ స్పెషల్ డిఎస్‌సి సాధన కమిటీ నిరసనలు

మండలాల్లో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కాపీలను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఆదివాసి స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల కోసం ఆర్డినెన్స్ జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సాధన కమిటీ సభ్యులు, నిరుద్యోగ గిరిజన యువత ఈ సందర్భంగా నినాదాలు చేశారు. స్పెషల్ డిఎస్సి కోసం మే2న నిర్వహిస్తున్న మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్సీ సాధన కమిటీ నేతలు మాట్లాడుతూ: సిఎం నారా చంద్రబాబు నాయుడు అరకు పర్యటనలో ఇచ్చిన ఎన్నికల హామీని తక్షణమే నిలబెట్టుకోవాలన్నారు. ఆదివాసి ప్రాంతంలో నూటికి 100శాతం ఉద్యోగాలు ఆదివాసులకే ఇచ్చేలా ఆర్డినెన్స్ తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 30వ తేదీలోపు ఆదివాసులకు స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ ప్రభుత్వం విడుదల చేయకపోతే మే రెండవ తేదీ నుంచి నిరవధిక బంధ్ చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ నాయకులు కూడ రాధాకృష్ణ, వంతాల నాగేశ్వరరావు, భాను, వి ప్రతాప్, జె.కుమారస్వామి, సిహెచ్ మహేష్, పి.చిరంజీవి, డి.మోహన్, పిట్ట నరేష్, ఆర్.ప్రశాంత్ కుమార్, మత్యలింగం, ఆదివాసి స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ సలహాదారులు, నాయకులు నూకరాజు, సలీం, చిరంజీవి, శంకర్, రంజిత్ కుమార్, శ్యాంసుందర్, బాలకృష్ణ పాల్గొన్నారు.



హుకుంపేటలో దగ్ధం చేస్తున్న సభ్యులు

హుకుంపేట: స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ పిలుపు మేరకు ఓల్డా, గూడ గ్రామాలలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా డీఎస్సీ సాధన కమిటీ ప్రతినిధులు పి సురేష్, ఎస్ రాధాకృష్ణ మాట్లాడుతూ, ఆదివాసులకు స్పెషల్ డిఎస్సి నోటిఫికేసన్ తక్షణమే విడుదల చేయాలని, జిఒ 3 కు ప్రత్నామ్నాయంగా జిఓ విడుదల చేయాలని తెలిపారు. ఆదివాసులకు వందకు వందశాతం ఉద్యోగ రిజర్వేషన్ నియామక చట్టం చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి నరేష్, రాధాకృష్ణ, గణేష్, కేబీ ప్రసాద్, ఎస్ సత్యనారాయణ, ఎస్.భూషణం, ఎస్.సూరిబాబు, ఎస్.గిరి, బి కాంతిరాజు, విశ్వేష్, శ్రీను, ఈశ్వరి, ఎస్ ఝాన్సీ, రజిత, నిరుద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



యుటిఎఫ్, ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ర్యాలీ

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ రాజవొమ్మంగిలో యుటిఎఫ్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో టిడిపి కూటమి నేతలు గ్రామస్తులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం నుండి స్టేషన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. మృతులకు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ. ఉగ్రవాదుల దాడి అమానవీయమని, ఎంత మాత్రం సహించరాదని అన్నారు.. ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా కేంద్రం గట్టి చర్యలు చేపట్టాలని కోరారు కార్యక్రమంలో ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు, యుటిఎఫ్ అంగన్వాడి, డివైఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు కె శ్రీను, పైడిమల్లు, రమేష్, సుబ్బారావు, వెంకటలక్ష్మి, సత్యవతి, కె వెంకటలక్ష్మి, టి శ్రీను, మోర్త బుజ్జిబాబు, సీహెచ్ కుమారీ స్థానికులు పాల్గొన్నారు.

పండుగలా మేడే జరుపుకుందాం : సిఐటియు



సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నేత రామరాజు

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే ను కార్మికులందరూ పండుగల జరుపుకుందామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు పిలుపునిచ్చారు. ఆదివారం రాజవొమ్మంగిలో కె వెంకటలక్ష్మి అధ్యక్షతన సిఐటియు, ప్రజా సంఘాల విస్తృతస్థాయి సమావేశంలో రామరాజు మాట్లాడుతూ, అంగన్‌వాడీలకు వేతనాలు పెంచకుండా, వివిధ యాప్‌లతో పనిభారాన్ని పెంచారన్నారు ఇక ఆశాలకు కనీస వేతనం అమలు చేయకుండా, అరకొర వేతనాలైనా సకాలంలో చెల్లించకుండా పనిఒత్తిడితో మానసిక వేదనకు గురిచేయడం దారుణమన్నారు. చాలీచాలని జీతాలతో, సక్రమంగా బిల్లులు అందక మిడ్డే మీల్స్ వర్కర్లు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. భవననిర్మాణం రంగంలో తాపీ మేస్త్రీలు, ఎలక్ట్రికల్ వర్కర్లు, కార్పెంటర్లు, పెయింటర్లు, రాడ్ బెండింగ్, కాంక్రీట్ పనిచేస్తున్న కార్మికులకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. సంక్షేమ బోర్డు నిధులు దారి మళ్ళి పోతున్నాయని, పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. పెరుగుతున్న ధరల భారం, కార్మికులు ఇబ్బందులు పడుతున్న కూటమి ప్రభుత్వం స్పందచడం లేదన్నారు. హక్కులు సాధనకు పోరాటాలే మార్గమన్నారు. అన్నిరంగాల కార్మికులను కలుపుకుని మేడేను పండుగలా జరుపుకుందామన్నారు కార్మికుల హక్కులపై సైద్ధాంతిక దాడి, శ్రమ దోపిడీపై ఐక్యంగా ఎదుర్కోవాలని కోరారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి వచ్చేనెల 20న దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు ఐక్యంగా విజయవంతం చేద్దామన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ, ఆశా యూనియన్, తాపీమేస్త్రీ, ఎలక్ట్రికల్, పెయింటర్, వ్యవసాయ కూలీ, తదితర సంఘాల నాయకులు సిహెచ్ కుమారి, ఎస్ వీరబాబు, వి భద్రం, ఏ యోహన్, పి ప్రసాద్, ఏ అమ్మిరాజు, పి సూర్యకుమారి, చంద్రావతి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



పప్పుల శివప్రసాద్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి -రాజవొమ్మంగి: లోదొడ్డి పంచాయితీ పాకవెల్తి గ్రామంలో విద్యుత్ బల్బు వెలిగించేందుకు ప్రయత్నించి పప్పుల శివప్రసాద్ (18) అనే యువకుడు షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. జడ్డంగి పోలీస్‌స్టేషన్ ఎఎస్ఐ లక్ష్మి తెలిపిన వివరాలివి.

లోదొడ్డి పంచాయితీ పాకవెల్తి గ్రామంలో అంగన్వాడీకేంద్రం వద్ద విద్యుత్ స్తంభం వీధి లైటు రాత్రి సమయాల్లో వెలగక పోవడంతో స్థానికులు కర్రతో కొట్టడంతో వెలుగుతోంది.. శనివారం సాయంత్రం వెలగని వీధిదీపాన్ని సరిచేసేందుకు శివప్రసాద్ స్తంభం ఎక్కి బాగుచేస్తుండగా, హైటెక్షన్ వైరు తగిలి విద్యుత్‌షాక్‌తో కింద పడిపోయారు. లోదొడ్డి సర్పంచ్ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, శివప్రసాద్ కుటుంబ సభ్యులు వెంటనే బాధితుడిని 108 వాహనంలో పాకవెల్తి నుండి ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శివప్రసాద్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని ఎఎస్ఐ లక్ష్మి తెలిపారు. శివప్రసాద్ మతదేహాన్ని ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి సర్పంచ్ లోతా రామారావు ఆధ్వర్యంలో కుటుంబీకులు తరలించారన్నారు. సర్పంచ్ లోతా రామారావు, ముర్ల రమణ, కాకూరి వెంకటరెడ్డి, ప్రసాద్ సమక్షంలో శవపంచనామాను నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు తెలిపారు. మృతుడు శివప్రసాద్ తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, విజయ భాస్కర్ దంపతులు ఏర్పాటుచేసిన ఉచిత అంబులెన్సు ద్వారా మృతదేహాన్ని పాకవెల్తి తరలించేందుకు సహకరించారు. ప్రమాదప్రాంతాన్ని విద్యుత్ ఇన్‌ఛార్జి ఎఇఇ కె. అబ్బాయిదొర, సిబ్బంది పరిశీలించారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ లోతా రామారావు గ్రామస్తులు కోరారు.

వైద్యశిబిరం విజయవంతం

ప్రజాశక్తి -విఆర్.పురం: మండలంలో రేఖపల్లి గ్రామంలో ఆంధ్రా వనవాసి కల్యాణ్ ఆశ్రమం ఆధ్వర్యంలో స్థానిక ఆలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని వైసీపీ మండల అధ్యక్షులు మాదిరెడ్డి సత్తి బాబు ప్రారంబించారు. ప్రతినెలా 26న నిర్వహించే వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ బి శ్రీనివాసరావు తెలిపారు. శిబిరంలో పక్షవాతం గుండెపోటు షుగర్, రక్తపోటు తదితర వ్యాధులకు వైద్యపరీక్షలతోపాటు ఉచితంగా మందులు అందజేస్తామన్నారు. మెరుగైన వైద్యసేవలు అవసరమైతే తమ సొంత ఖర్చులతో రోగులను విశాఖపట్నం తీసుకెళ్లి ఉచితంగా ఆపరేషన్లు, మందులు ఇస్తామన్నారు. రోగితోపాటు సహాయకునికి ఉచిత భోజనం, వసతి సదుపాయాలను కల్పిస్తామన్నారు..ప్రతి నెలా డివిజన్ వ్యాప్తంగా తమ సంస్థ ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తామని మండల కోఆర్డినేనర్ ఐ.వి. ప్రసాద్ తెలిపారు. తమ కార్యకర్తలుగా నియమిస్తామని డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు, స్వచ్ఛంద కార్యకర్తలకు ఒక నెల శిక్షణనిచ్చి, వారివద్దే అత్యవసర మందులు ఉంచుతామన్నారు. మండలస్థాయిలో సూపర్‌వైజర్‌ను నియమిస్తామని, వారికి నెలకు రూ.మూడు వేల గౌరవవేతనంతోపాటు టిఎ,డిఎ ఉంటుందన్నారు. సేవా దృక్పథంతో పనిచేసేవారు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో వనవాసి ఆయుర్వేద మండల కార్యకర్తలు బాగుల రాజారావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దొన్నుదొర

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొన్నుదొర

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ : కూటమి ప్రభుత్వం రాకతో మత్స్యకారుల అభ్యున్నతికి కృషి చేస్తోందనిఅరకు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి సియ్యారి దొన్నుదొర అన్నారు. అరకువేలి టిడిపి పార్టీ కార్యాలయంలో ఆదివారం అరకు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి,ఆర్టీసి విజయనగరం రీజినల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర మాట్లాడుతూ, గతంలో రూ.10వేలు ఇచ్చే భృతిని కూటమి ప్రభుత్వం ఇప్పుడు రూ.20వేలకు పెంచిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వేట నిషేధ సమయంలో ఆర్థికసాయం రెట్టింపు చేసి విడుదల చేసి అందించారన్నారు. రాష్ట్రంలో 68,396 మంది మత్స్యకారులకు నెలనెలా పింఛన్లు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. మత్స్యకారులు చేపల వేట సమయంలో మరణిస్తే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియో,వేటకు వెళ్లే బోట్లకు లీటర్ డీజిల్‌పై రూ.9 సబ్సిడీ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, ఉప సర్పంచ్ పాడి విజయ నిర్మల, ఎంపీటీసీ ఎల్బి భీమరాజు, వార్డు మెంబర్ త్రినాథ్, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపిటిసి

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -రావికమతం: మండల కేంద్రంలో గ్రౌండ్ బాయ్స్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలను సర్పంచ్ గెంజి మోది నాయుడు, ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు, సూర్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ గంటా ఈశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గెంజి ఈశ్వరరావు, యూత్ లీడర్ పులగాయల గోవిందు, సత్యనారాయణ, శ్రీనులు ఆదివారం ప్రారంభించారు. మండల కేంద్రంలో జడ్పీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన పోటీలను ఉద్దేశించి గ్రౌండ్ బాయ్స్ యూత్ లీడర్ గోవిందు బ్రదర్స్ మాట్లాడుతూ, నెలరోజుల పాటు ఐపీఎల్ తరహాలో క్రికెట్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి 15 వేలు, ద్వితీయ బహుమతి రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.6000 అందజేయడం జరుగు తుందన్నారు. సర్పంచ్ మోది నాయుడు మాట్లా డుతూ, ఆటలు మానసిక ఉల్లాసానికి, శరీర దారుణ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.

ఘనంగా మారెమ్మ పండుగ

అమ్మవారి దర్శనానికి నాలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు



మారెమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

ప్రజాశక్తి -సీలేరు: జీకే వీధి మండలం సీలేరు మారెమ్మ 53వ వార్షికోత్సవం ఆదివారం కనులపండువగా జరిగింది. ఉదయం నుంచే ఆంధ్రా, ఒడిశా; తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, మారెమ్మను దర్శించుకుని, ప్రత్యేకపూజలు, మొక్కుబడులు తీర్చుకున్నారు. తండోప తండాలుగా భక్తుల రాకతో అమ్మవారి ఆలయంలో కిక్కిరిసిపోయింది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని సిఆర్‌పిఎఫ్ బలగాలు, స్థానిక పోలీసులతోపాటు ఎపి జెన్కో సెక్యూరిటీ సిబ్బంది భద్రతా చర్యలు చేపట్టారు. భారీగా తరలివచ్చిన వాహనాలతో ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లు చేశారు. భక్తులను క్యూ పద్ధతిలో అమ్మ వారి దర్శనాలకు అనుమతించడం, అక్కడ భద్రతా చర్యలు చేపట్టడంతో ఉత్సవం ప్రశాంతంగా సాగింది. మారెమ్మ మొక్కుబడులలో భాగంగా పలువురు భక్తులు, కోళ్లు, మేకలను బలిచ్చారు. ఇతర రాష్ట్రాలతోపాటు రాష్ట్రంలోని ఇతర జిల్లాలు నుంచి వచ్చిన భక్తులు, సందర్శకులకు గిరిజన ఆచార సాంప్రదాయాల ప్రకారం థింసా నృత్యాలు ఏర్పాటు చేసి కనువిందు చేశారు.

మారెమ్మ వార్షికోత్సవం సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగి జీవి సత్యనారాయణ ఆర్థిక సహాయంతో ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.




పండుగ సందర్భంగా థింసా నృత్యాలతో గిరి మహిళల సందడి

సీలేరు సంతకు పండుగ జోష్

సీలేరు: మారెమ్మతల్లి 53వ వార్షికోత్సవం సందర్భంగా భారీ ఎత్తున తరలివచ్చిన భక్తులు సీలేరు వారపుసంతకు రావడంతో సంత కిక్కిరిసిపోయింది. మారెమ్మ దర్శనాలకు వచ్చిన వారంతా సంతకు వచ్చి, గిరిజన అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపడంతో వ్యాపారాలు జోరుగా సాగాయి. గత రెండు వారాలుగా వెలవెలబోయిన సీలేరు సంతకు మారెమ్మ పండుగ జోష్ వచ్చింది. ఆశించిన స్థాయి కంటే ఎక్కువగా అమ్మకాలు జరగడంతో సంతకు వచ్చిన వ్యాపారుల, గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దు పాటు కూనవరం, దుప్పిలివాడ తదితర పంచాయతీ గ్రామాల నుంచి కూరగాయలను తెచ్చిన మాలీలు, అవన్నీ మంచి ధరకు అమ్ముడుపోవడంతో సంతోషపడ్డారు. మారెమ్మ తల్లి పండుగ పుణ్యమాని, మండువేసవిలోనూ సీలేరు సంత జనసంద్రంగా మారింది.

కనువిందు చేసిన సీలేరు అందాలు

సీలేరు: మారెమ్మ పండుగకు మైదానం ప్రాంతంతోపాటు నాలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు, సందర్శకులకు సీలేరు అందాలు కనువిందు చేశారు.. సీలేరు మెయిన్ డ్యాం, నది పరివాహక ప్రాంతంలో ఆహ్లాదకరమైన వాతావరణం, నదీజలాలు, ఎత్తయిన కొండలు, పచ్చనిచెట్లు, జాలువారే జలపాతాలు వంటి సహజసిద్ధమైన ప్రకృతి అందాలను చూసి మైమరిచిపోయారు సీలేరు డ్యాం చివరన గట్టుపైనా, మెట్ల వద్ద ఫొటోలు, సెల్ఫీలతో సందడి చేశారు. ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో సూర్యాస్తమయం సమయంలో ఎత్తైన కొండపై స్వర్ణకాంతిలో మెరిసిన భానుడి అందాలను చూసి మైమరిచిపోయారు. సీలేరు జల విద్యుత్ కేంద్రం, ఇంటెక్ డ్యాం రెగ్యులేటరీ డ్యాం పర్యాటకులతో నిండిపోయింది.. సీలేరు మారుమూల ప్రాంతాల్లోకమనీయమైన దృశ్యాలు చూసి ప్రత్యేక అనుభూతి పొందారు.



సీలేరు మెయిన్ డ్యాం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు



మట్టిని ట్రాక్టర్లతో తరలిస్తున్న అక్రమార్కులు

ప్రజాశక్తి -చింతూరు : చింతూరు డివిజన్ ఎటపాక మండల పరిధిలోని లక్ష్మీదేవి పేటలో అనుమతులు లేకుండా రాత్రి పగలు తేడా లేకుండా మట్టి తవ్వకాలు, తరలింపు యథేచ్ఛగా సాగు తోందనే విమర్శలున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో అక్రమార్కులకు కలిసి వచ్చిందని చెప్పవచ్చు. దీంతో ట్రాక్టర్లతో బాహాటంగానే మట్టిని తరలించారు అడ్డూఅదుపూ లేకుండా మట్టివ్యాపారం చేస్తూ, అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. మట్టి అక్రమ తవ్వకాలపై నిఘాపెట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు ట్రాక్టర్లు సీజ్ చేయాలని పలువురు కోరుతున్నారు.

నేడు టిడిపి సమావేశం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: తెలుగుదేశం పార్టీ పాడేరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఈనెల 28న సోమవారం జరగనుందని ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రం పాడేరులోని కుమ్మరిపుట్టులో తన నివాసం వద్ద క్యాంపు హౌస్‌లో సమావేశం నిర్వహిస్తామని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన పార్టీ రాష్ట్ర, పార్లమెంట్, నియోజకవర్గ సీనియర్ నాయకులు, పార్టీ మండల అధ్యక్షులు, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, మాజీ నాయకులు, క్లస్టర్, యూనిట్ ఇన్చార్జిలు, బూత్ కమిటీలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, కార్యకర్తలు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

28 నుంచి వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని వినడొడ్డిగిడ్డ శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరానికి అంతా సిద్ధం చేసినట్లు గ్రంథాలయ అధికారి జనార్ధన్ తెలిపారు. ఈనెల 28 సోమవారం నుండి జూన్ 6 వరకు విజ్ఞాన వేసవి శిబిరాన్ని నిర్వహిస్తున్నామని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆదివారం గ్రామంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులకు వేసవి విజ్ఞాన శిబిరం పై అవగాహన కల్పించారు. 40 రోజులపాటు నిర్వహించనున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చీడికాడ:విద్యార్థుల్లో నైపుణ్యతను పెంపొందించేందుకు శాఖా గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తామని లైబ్రేరియన్ జోగేశ్వర తెలిపారు. ఈ శిబిరంలో క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు.

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:స్థానిక స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాకవరపాలెం మండలం పాపయ్యపాలెం గ్రామానికి చెందిన కొసిరెడ్డి రామలక్ష్మికి రూ.3,69,432 చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారికి సిఎం సహాయనిధి ఆర్థికంగా తోడ్పడుతుందన్నారు.గత తొమ్మిది నెలల్లో నియోజకవర్గంలోని 24 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించామని వివరించారు. ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాకవరపాలెం మండల అధ్యక్షుడు యర్రాపాత్రుడు, సర్పంచ్ అల్లునాయుడు, మాకవరపాలెం మండలం టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధితునికి అండగా 'సాయానికి రూ.10 సంస్థ'

- ఆపరేషన్ కోసం రూ.15,09,951 సేకరణ

ప్రజాశక్తి -నక్కపల్లి: రెక్కాడితే గాని.. డొక్కాడని.. పరిస్థితి. కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్న దొంగల శ్రీను. కూలి పని నిమిత్తం కొబ్బరి తీతకు వెళ్లి ప్రమాదవశాత్తు కొబ్బరి చెట్టు పై నుండి జారిపడి వెన్నుపూస విరిగి పోవడంతో, ఆపరేషన్ చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో మంచానికి పరిమితమయ్యాడు. గాయపడ్డ శ్రీను, అతని కుటుంబానికి సాయానికి 10 రూపాయలు సేవా సంస్థ ఆపరేషన్ కోసం 15,09,951 లక్షల రూపాయలు ఆర్థికసాయం సేకరణ చేపట్టి అండగా నిలిచారు. మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన దొంగల శ్రీను కూలి పని నిమిత్తం కొబ్బరి చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా చెట్టు పైనుంచి కింద పడి వెన్నుపూస విరిగిపోయింది. ఆసుపత్రికి వెళ్లి చూపించగా, ఆపరేషన్ కు సుమారు అధికంగా నగదు ఖర్చు అవుతుందని చెప్పడంతో దిక్కుతోచని స్థితిలో ఇంటి వద్ద మంచానికి పరిమితమయ్యాడు. సాయానికి 10 రూపాయలు సేవా సంస్థ అధ్యక్షులు ఏసుబాబు, సారథి టీం సభ్యులతో కలిసి మంచానికి పరిమితమైన శ్రీను, అతని కుటుంబ పరిస్థితిని వీడియో రూపంలో చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.సంస్థ సభ్యులు, స్నేహితుల సహాయంతో సోషల్ మీడియా ద్వారా రూ.15,09,951 లక్షల విరాళాలు సేకరించారు. ఈ మొత్తాన్ని నర్సీపట్నం డి.ఎస్.పి శ్రీనివాసరావు చేతుల మీదుగా సంస్థ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీను కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎమ్ఎస్ఎల్ కాలేజ్ బాటని లెక్చరర్ ఎం.హరిబాబు, ప్రముఖ హోమియోపతి డాక్టర్ శేఖర్, మనం ట్రస్ట్ చైర్మన్ రమేష్, శెట్టిపాలెం గ్రామ సర్పంచ్ అల్లు రామానాయుడు, శెట్టిపాలెం గ్రామ యువ నాయకులు గొర్లి వాసుదేవ నాయుడు, సంస్థ సభ్యులు ఖాన్, సాయి, లహరి పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ప్రైవేటు పాఠశాలల్లో పేదలకు ఒకటో తరగతిలో 25శాతం సీట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం జిఓలు ఉత్తర్వులు జారీ చేసిందని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ అధికారి వివి స్వామి నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు యాజమాన్యాలు ఉచిత విద్య అందించేందుకు చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. జిల్లాలోని ఆయా బడులకు ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుందని, ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఈనెల 28 తేదీ నుంచి మే 15 వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 2025 మార్చి నాటికి ఐదేళ్లు పూర్తయి ఉండాలని సూచించారు. ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న అనాథ పిల్లలు, హెచ్ఐవి బాధితులు, దివ్యాంగులు, షెడ్యూల్ కులాలు, తెగలు, బిసి మైనార్టీ, ఓసి అల్పాదాయ వర్గాల వారు [illegible] వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. తల్లిదండ్రుల ఆధార్, ఓటర్, రేషన్, జాబ్ కార్డు, విద్యుత్ బిల్లులో ఏదోకటి, పిల్లల పుట్టిన ధ్రువపత్రం సమర్పించాలని తెలిపారు. నిర్ధారణ తర్వాత నిబంధనలకు అనుగుణంగా లాటరీ ద్వారా సీట్లు కేటాయిస్తారన్నారు. గ్రామీణ ప్రాంత కుటుంబాలకు రూ.1.20 లక్షల వార్షికాదాయం, పట్టణ ప్రాంత కుటుంబాలకు రూ.1.44 లక్షల మించకుండా ఉండాలని, పాఠశాల నుంచి మూడు కిలోమీటర్ల పరిధిలోపల నివాసం ఉన్నవారే అర్హులని పేర్కొన్నారు.

ఆగని ఇసుక అక్రమ తవ్వకాలు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట: మండలంలోని వెదుర్లగెడ్డ వద్ద ఇసుక అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ప్రతిరోజు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల నుండి అక్రమంగా రవాణా జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో వంతెన సైతం ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. వెదుర్లగడ్డకు సమీపంలో విశాలమైన స్థలంలో ఇసుక మేటలు అక్రమదారులు వేస్తున్నారు. వీటిని సమీప గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల యజమానులు పగలు రాత్రి లేకుండా ప్రతిరోజు తవ్వకాలు చేపడుతున్నారు. ఇసుక తవ్వకాలతో వెదుర్ల గడ్డపై వేసిన వంతెన పిల్లర్ల సైతం బయటకు కనిపిస్తూ ప్రమాదకరంగా ఉన్నాయి.

మండలంలో వడ్డాది, పెద్దేరు, విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెనలు ఇసుక తవ్వకాలతో పిల్లర్లు బయటకు కనిపించి కొద్ది కాలానికి కూలి పోయాయి. ఈ వంతెనల కూలి పోవడంతో రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వెదుర్లగడ్డ వంతెన వద్ద జరుగుతున్న అక్రమ రవాణాతో వంతెనకు సైతం ప్రమాదం వాటిల్లే పరిస్థితి ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని మండల వాసులు కోరుతున్నారు.

సామాన్య భక్తులకు త్వరితగతిన దర్శనం

రాష్ట్ర హోంమంత్రి అనిత



మీడియాతో మాట్లాడుతున్న హోంమంత్రి వంగలపూడి అనిత

ప్రజాశక్తి -గోపాలపట్నం : సామాన్య భక్తులకు త్వరితగతిన అప్పన్న దర్శనం కల్పిస్తామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె ఆదివారం సింహాచలం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ సంవత్సరం సామాన్య భక్తులకు పెద్దపీట వేసే దిశగా ప్రభుత్వ నిర్ణయం తీసుకుందని తెలిపారు. విఐపిలు, వివిఐపిలతో సామాన్య భక్త జనానికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం ఏర్పాట్లు చేస్తుందని చెప్పారు. అనంతరం దేవస్థానం ఏర్పాటుచేసిన క్యూలైన్లు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిరప్రసాద్, పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి, ఎండోమెంట్ కమిషనర్, ఎఒ, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అక్రమ క్వారీలను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి -రావికమతం: మండలంలో కవగుంట గ్రామ సమీపంలో ఊరలోవ కొండపై అక్రమ క్వారీ నిర్మాణాలను తక్షణమే నిలుపుదల చేయాలని గ్రామ సర్పంచు దాసరి సూర్య కుమారి, రైతులు డిమాండ్ చేశారు. కొండపై గ్రానైట్ తవ్వకాలలో బ్లాస్టింగులతో క్వారీ సమీపంలో గల కవగుంట గ్రామస్తులు భయ బ్రాంతులకు గురవుతున్నారన్నారు.క్వారీ సమీపం నుంచి రావికమతం, కవగుంట మీదుగా విజె పురం, ఓమ్మలి వయా మాడుగుల వెళ్లే రోడ్డు కావడంతో ఏ సమయంలో రాళ్లు ఎగిరి పడతాయోనని పాదచారులు, వాహన చోధకులు భయబ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు.కవగుంట గ్రామానికి చెందిన రైతులు భూముల్లో క్వారీ బుగ్గి, చెత్తాచెదారం పడటంతో బీడు భూములుగా మారి పంటలు పూర్తిగా నాశనం అవుతున్నాయన్నారు. బ్లాస్టింగ్ శబ్దానికి ఇల్లులు దెబ్బతింటున్నాయన్నారు.కోతులు, నక్కలు, ఊర పిల్లులు, చెవల పిల్లలు, అడవి పందులకు తలదాచుకునేందుకు అవకాశం లేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీ యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరించడం సరికాదన్నారు.

ఉత్తమ ఫలితాలతో..

వడ్డాది కెజిబివిలో ప్రవేశాలకు డిమాండ్

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మెరుగైన విద్యాబోధన, ఉత్తమ ఫలితాలు, విద్యార్థులకు తగిన వసతి సౌకర్యాలు కలిగి ఉండడంతో మండలంలో వడ్డాది కస్తూరిబా గాంధీ బాలికల వసతి గృహం(కేజీబీవీ)లో ప్రవేశాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన, అవసరమైన తరగతి గదులు, ల్యాబ్ సౌకర్యాలు కలిగి ఉండడంతో బాలికల తల్లిదండ్రులు తమ పిల్లలను కేజీబీవీలోనే చేర్పించాలని భావిస్తున్నారు. గత కొంతకాలంగా పదవ తరగతి, ఇంటర్మీడియట్‌లో సైతం ఉత్తమ ఫలితాలు సాధించడంతో తల్లిదండ్రుల్లో ఆసక్తి మరింత పెరిగింది. 2024-25 విద్యా సంవత్సరంలో పదవ తరగతిలో 40 మంది విద్యార్థులకు గాని 39 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగైన ఫలితాలను సాధించారు. టెన్త్‌లో 600 మార్కులకు గాను 560 మార్కులను ఈ పాఠశాలకు చెందిన విద్యార్థిని కడియం శ్రీలాస్య సాధించింది. ఎం.కృష్ణవేణి, మౌనికలు 550 మార్కులు సాధించారు.

ఇంటర్మీడియట్లో సైతం 100శాతం ఫలితాలను సాధించారు. 35 మంది విద్యార్థులకు గాను 35 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎ.వెంకటపద్మ 1000 మార్కులకు 966 మార్కులు సాధించింది. కె.లోహిత 947, యు.గణేశ్వరి 932 మార్కులు సాధించారు. బాలికల తల్లిదండ్రుల ఆసక్తి అధికంగా ఉండడంతో ఆరవ తరగతి ప్రవేశాలకు విపరీతమైన పోటీ నెలకొంది.

ఉత్తమ బోధనతో మెరుగైన ఫలితాలు

పాఠశాలలో మెరుగైన మౌలిక వసతులు, ఉపాధ్యాయుల ఉత్తమ విద్యా బోధనతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. తమ పిల్లలను కేజీబీవీ లో చేర్పించడానికి తల్లిదండ్రుల ఆసక్తి చూపుతున్నారు.

పక్కా ప్రణాళికతో చదివించాం

రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి అధికారుల పర్యవేక్షణ ప్రోత్సాహంతో మెరుగైన ఫలితాలు సాధించడం జరిగింది. పక్కా ప్రణాళికను అనుసరించి విద్యాబోధన ప్రతిరోజు చేశాం. పరీక్షా విధానాలతో, అదనపు తరగతులతో మెరుగైన ఫలితాలు సాధించాం.

ఎడ్ల సత్యవేణి,
చైర్మన్ కేజీబీవీ

వేట నిషేధ భృతిగా రూ.40 వేలు చెల్లించాలి : వైసిపి

ప్రజాశక్తి -నక్కపల్లి:మత్స్యకారులకు వేట నిషేధ భృతిని గత ఏడాది, ఈ సంవత్సరం కలిపి రూ.40 వేల రూపాయలు చెల్లించాలని వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక మత్స్యకార నాయకులతో కలిసి మాట్లాడుతూ, గత ఏడాది పరిహారం చెల్లిస్తారని మత్స్యకారులు ఇప్పటివరకు ఎదురు చూశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం ఈ ఏడాదికి మాత్రమే పరిహారం చెల్లించి చేతులు దులుపుకుందన్నారు. శనివారం జరిగిన మత్స్యకార సేవలో అనే కార్యక్రమంలో హెూంమంత్రి వంగలపూడి అనిత వేట నిషేధ భృతి పంపిణీలో నూరు శాతం అమలు చేశామని గొప్పలు చెప్పుకుంటున్న చెప్పారని, కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలకు కలిపి 40 వేల రూపాయలు చెల్లించలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేసేందుకు కాలయాపన చేస్తుందే తప్పా, మాట నిలబెట్టుకున్న దాఖలాలు కనిపించలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మండలంలోని దొండవాక గ్రామంలో 24 కోట్ల రూపాయలతో జెట్టి నిర్మాణంకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, కూటమి ప్రభుత్వం దాన్ని నిలిపివేసి డీఎల్ పురం గ్రామంలో పోర్ట్ పేరుతో ప్రైవేటు కంపెనీ కి దారాదత్తం చేస్తుందని, ఇదేనా మత్స్యకారులకు భరోసా కల్పించడం అని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం అవుతున్నా ఇప్పటివరకు కొత్త పింఛన్లు మంజూరు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో చినతీనార్ల పంచాయతీ సర్పంచ్ ఎరిపిల్లి ముసలయ్య, నాయకులు ఎరిపిల్లి నాగేష్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -రావికమతం: మండల కేంద్రంలో గ్రౌండ్ బాయ్స్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ పోటీలను సర్పంచ్ గెంజి మోది నాయుడు, ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు, సూర్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ గంటా ఈశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు గెంజి ఈశ్వరరావు, యూత్ లీడర్ పులగాయల గోవిందు, సత్యనారాయణ, శ్రీనులు ఆదివారం ప్రారంభించారు. మండల కేంద్రంలో జడ్పీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన పోటీలను ఉద్దేశించి గ్రౌండ్ బాయ్స్ యూత్ లీడర్ గోవిందు బ్రదర్స్ మాట్లాడుతూ, నెలరోజుల పాటు ఐపీఎల్ తరహాలో క్రికెట్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.



పీలాకు బి ఫారం అందజేస్తున్న బాబ్జి

మేయర్ అభ్యర్థిగా పీలా

- ఖరారు చేసిన అధిష్టానం

- బి ఫారం అందజేసిన టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సోమవారం జివిఎంసి మేయర్ ఎన్నిక నేపథ్యంలో టిడిపి అధిష్టానం కీలక ప్రకటన చేసింది. ఊహించినట్టుగానే మేయర్ అభ్యర్థిగా పీలా శ్రీనివాసరావును ఖరారు చేసింది. ఈ మేరకు రాష్ట్ర కో-ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి పార్టీ జిల్లా కార్యాలయంలో పీలాకు ఆదివారం బి ఫారం అందజేశారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ మేయర్ మార్పు విశాఖ కోసమే జరుగుతోందని అన్నారు. వైసిపి ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైతే నాలుగేళ్లపాటు వైసిపి పాలనతో జివిఎంసిలో అభివృద్ధి కుంటుపడిందని తెలిపారు. కూటమి పాలనలో విశాఖను అభివృద్ధి చేయాలనే దృక్పథంతో పై నాయకులు మేయర్‌ను మార్చాలని నిర్ణయించారని చెప్పారు. మేయర్ మార్పుతో విశాఖపట్నం మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇదిలా ఉండగా, టిడిపి, జనసేన, బిజెపి కూటమి మేయర్ అభ్యర్థిగా ఎంపికైన పీలా శ్రీనివాసరావు 2021 మార్చిలో జరిగిన జివిఎంసి ఎన్నికల్లో 96వ వార్డు నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా భారీ ఆధిక్యతతో విజయం సాధించారు. అప్పట్లో టిడిపి పీలా శ్రీనివాసరావును మేయర్ అభ్యర్థిగా ముందుగానే ప్రకటించింది. అయితే ఆ ఎన్నికలలో అధిక శాతం కార్పొరేటర్లు వైసిపి తరపున ఎన్నిక కావడంతో మేయర్ పీఠం టిడిపికి దక్కలేదు. దీంతో కౌన్సిల్‌లో టిడిపి ఫ్లోర్ లీడర్‌గా పీలా శ్రీనివాసరావు ఎంపికై నాలుగేళ్ల పాటు ఆ పదవిలో కొనసాగారు. నాడు జివిఎంసిలో వైసిపి తరపున ఎన్నికైన మేయర్ గొలగాని హరి వెంకట కుమారిని రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో పదవి నుంచి దించేయాలని భావించారు. ఈ క్రమంలోనే కూటమి తరపున అవిశ్వాస తీర్మానం పెట్టి ఇటీవల తొలగించారు. సోమవారం మేయర్ స్థానానికి ఎన్నిక జరగనుంది. పీలా శ్రీనివాసరావు 2007లో విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌కు జరిగిన ఎన్నికలలో 64వ వార్డు నుంచి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసి భారీ ఆధిక్యతతో విజయం సాధించారు. శ్రీనివాసరావు కుటుంబం ప్రారంభం నుంచి తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతోంది. ఆయన తండ్రి పీలా మహాలక్ష్మి నాయుడు తెలుగుదేశం పార్టీ తరపున పెందుర్తి మండల పరిషత్ అధ్యక్షునిగా రెండు పర్యాయాలు పనిచేశారు. అలాగే శ్రీనివాసరావు అన్నయ్య పీలా గోవింద సత్యనారాయణ అనకాపల్లి శాసనసభ్యునిగా 2019 ఎన్నికల్లో గెలుపొందారు. 2024లో కూటమి పార్టీల సర్దుబాట్లు కారణంగా ఆయనకు మరోసారి పోటీ చేసే అవకాశం రాలేదు. ఇటీవల ఆయనకు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవిని తెలుగుదేశం పార్టీ ఇచ్చింది.

చీరలు, పండ్లు పంపిణీ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి,తిరుమల దేవి వివాహ వార్షికోత్సవ కార్యక్రమం ఆదివారం 33 వ వార్డులో నిర్వహించారు. బంధు మిత్రులతో పాటు, సన్నిహితులు టిడిపి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై చక్రవర్తి దంపతులకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సుమారు వందమంది పేద మహిళలకు చీరలు, పండ్లు,రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి వివిధ వార్డుల అధ్యక్షులు సారిపిల్లి మహేష్,అయితే మధుబాబు,సింగంపల్లి మాధవి,మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డివిఎస్‌కె వరప్రసాద్,బూత్ క్లస్టర్స్ గందసత్య పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులకు ప్రభుత్వ స్థలాలు

- ఆధునిక వైద్యం ముసుగులో హెల్త్ సిటీ అభివృద్ధి
- ఇఎస్ఐ, జిల్లా కేంద్ర ఎన్‌టిఆర్ హాస్పిటల్ సేవలు నిర్వీర్యం
- భూముల వ్యవహారంపై అధికారుల గోప్యత



భూములను పరిశీలిస్తున్న విఎంఆర్‌డిఎ కమిషనర్ విశ్వనాథన్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ప్రజల ఆస్తులను కావాల్సిన వారికి కట్టబెట్టడానికి ప్రభుత్వం ఆడని నాటకంలేదు. చేయని పనిలేదు. ఎద్దు ఈనిందంటే దూడను కట్టేయాలని తాడు పట్టుకొని పరుగులు తీసే అధికారులున్న జిల్లాలో అభివృద్ధి ముసుగులో ప్రయివేటు వ్యక్తులకు విలువైన ఆస్తులను ధారాదత్తంచేసే చర్యను వేగవంతం చేస్తోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించని ప్రభుత్వం నక్కపల్లిలో ప్రయివేటు మిట్టల్ స్టీల్‌కు గనులు, ఇతర అనుమతులకు పూచీ పడింది. తాజాగా సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల పేరుతో అనకాపల్లిలో తొలుత 7.68 ఎకరాల విస్తీర్ణంలో హెల్త్ సిటీని అభివృద్ధిచేసి ప్రభుత్వ, ప్రయివేటు, భాగస్వామ్యం (పిపిపి) కింద ప్రయివేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు కారుచౌకగా స్థలాలను అప్పగించాలని చూస్తోంది. జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవల మెరుగు కంటే ప్రయివేటు ఆసుపత్రులను ప్రోత్సహించే ఆలోచనలో ప్రభుత్వం వుంది. పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి పరిశ్రమల కార్మికులకు అందుబాటులో ఉండేలా అచ్యుతాపురం సెజ్‌లో రూ.62 కోట్ల వ్యయంతో 30 పడకల ఎంప్లాయ్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఇఎస్ఐ) ఆసుపత్రి, వైద్యులు, సిబ్బంది నిమిత్తం 16 నివాస గృహ సముదాయాల భవన నిర్మాణ పనులకు 2024 అక్టోబర్ 29న ప్రధాన మోడీ వర్చువల్‌లో శంకుస్థాపన చేశారు. సెజ్, ఇతర పరిశ్రమల కార్మిక కుటుంబాలకు, పరిశ్రమల ప్రమాద సమయంలో బాధితులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ఇఎస్ఐ ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు చెప్పి ఏడాది కాకముందే పరిశ్రమల ప్రమాదాల్లో గాయపడిన కార్మికుల కోసం హెల్త్ సిటీని అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు కొత్త పల్లవి అందుకున్నారు. ఇఎస్ఐ, ఎన్‌టిఆర్ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్యసేవలు అందించే బాధ్యత నుంచి తప్పుకొనేలా ప్రభుత్వ చర్యలున్నాయి. ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణ పనులకు శంకుస్థాపనచేసి ఏడాది కాకముందే ప్రయివేటు ఆసుపత్రులను ప్రోత్సహిస్తోంది. విశాఖ నగరంలోని ఆరిలోవ హెల్త్ సిటీలో ప్రభుత్వం నుంచి భూములు పొందిన ప్రయివేటు ఆసుపత్రులేవీ పేదలకు ఉచిత వైద్య సేవల కల్పనపై ఇచ్చిన హామీని అమలుచేయడంలేదు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవల ముసుగులో అచ్యుతాపురం ఇఎస్ఐ, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎన్‌టిఆర్ ఆసుపత్రిని ప్రభుత్వం తాజాగా నిర్వీరం చేయాలని చూస్తోంది.

ప్రయివేటు ఆసుపత్రులకు చౌకగా భూములివ్వడంతో సరిపెట్టుకోకుండా అన్ని మౌలిక సదుపాయాలనూ సమకూర్చి అప్పగించే ఆలోచనలో సర్కారు వుంది. హెల్త్‌సిటీలో మౌలిక సదుపాయాలను విఎంఆర్‌డిఎ కల్పించాక ప్రయివేటు ఆసుపత్రులకు స్థలాలు కేటాయించనున్నారు. అయితే హెల్త్‌సిటీకి గుర్తించిన 7.68 ఎకరాల విషయాన్ని చెప్పడానికి అధికారులు ఇష్టపడ్డంలేదు. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి వుంటే అచ్యుతాపురం ఇఎస్ఐ, జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ ప్రభుత్వ ఆసుపత్రిని తీర్చిదిద్దాలని పలువురు కోరుతున్నారు.

వక్ఫ్ సవరణ వెనుక బోలెడు కుట్రలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ముస్లిములపై దాడులు చేస్తూ ముస్లిముల ఆస్తులు కొట్టేయాలన్న కుట్రతోనే కేంద్ర బిజెపి ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం-2025 బిల్లును ప్రవేశపెట్టిందని, దీన్ని వ్యతిరేకిస్తున్నామని రాజ్యాంగ పరిరక్షణ కమిటీ ప్రతినిధి రహమతుల్లా బేగ్ అన్నారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులన్నీ ముస్లిం దాతలు ఎప్పుడో తమ అభీష్టం ప్రకారం ముస్లిం సమాజం కోసం త్యాగం చేసి దానం చేసిన ఆస్తులని, ఇవి ప్రభుత్వానికి సంబంధించినవి కావని అన్నారు. న్యాయవాది షరీఫ్ మాట్లాడుతూ నాటి వక్ఫ్ బోర్డు నేపథ్యాన్ని వివరించారు. రాష్ట్రంలో సుమారు 3500 వక్ఫ్ సంస్థలు మస్జిద్, బరిఅల్ గ్రౌండ్స్, పంజాలు, అశూర్ ఖానాలు, లంగర్ ఖానాలు, ఇధాలు పేరిట వక్ఫ్ ఆస్తులను కలిగి ఉన్నాయని, సుమారు 65 వేల ఎకరాలుగా అవి నమోదయ్యాయని తెలిపారు. ఆ భూములను సెంట్రల్ గవర్నమెంట్ అఫ్ ఇండియా, సెంట్రల్ వక్ఫ్ బోర్డు నిర్ధారించినట్టు పేర్కొన్నారు. వక్ఫ్ బోర్డులోని ఉద్యోగుల జీతభత్యాలు, నిర్వహణ ఖర్చులు రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో కాకుండా బోర్డు ఆదాయం నుంచే చెల్లిస్తున్నారని తెలియజేశారు. సమావేశంలో ముస్లిం నేతలు అహమతుల్లా ఖాన్, బషీర్, షరీఫ్, మునీర్ ఖాన్, నూర్ అహ్మద్, షేక్ బాజ్జి పాల్గొన్నారు.

షటిల్ టోర్నీ విజేతలు హర్ష, సూర్య

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరంలోని ఎండాడ ఎస్ఎస్ అకాడమీలో ఆదివారం ఉదయం నిర్వహించిన వెలగాడ అప్పలనాయుడు మెమోరియల్ షటిల్ టోర్నమెంట్-2025లో విన్నర్స్‌గా సాయి హర్ష, పందిరి సూర్య ప్రకాష్ నిలిచారు. నాకౌట్ పద్ధతిలో ఈ షటిల్ టోర్నమెంట్ జరగ్గా సుమారు 30 మంది పాల్గొన్నారు. రెండో స్థానంలో నితేష్, తేజ, మూడో స్థానంలో శ్రీనివాస్‌రెడ్డి, మోహన్ నిలిచారు.

ఎస్ఎస్ స్పోర్ట్స్ అకాడమీ యాజమాన్య ప్రతినిధులు సమీర్, నవీన్ స్వరూప్, సందీప్ పర్యవేక్షణలో ఈ టోర్నీ జరిగింది. ఓనర్ సమీర్ తండ్రి వెలగాడ అప్పలనాయుడు పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ షటిల్ టోర్నమెంట్‌ను నిర్వహించినట్లు ఎస్ఎస్ అకాడమీ నిర్వాహకులు సంధ్య తెలిపారు.



లోన్ యాప్స్ ముఠా వివరాలను వెల్లడిస్తున్న సిపి శంఖబ్రత బాగ్చి

లోన్ యాప్స్ మోసాల ముఠా అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : పాకిస్తాన్ కేంద్రంగా ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న లోన్ యాప్స్ ముఠాను విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలను విశాఖ నగర పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. ఆయన కథనం మేరకు.. మహారాణి పేటకు చెందిన నరేంద్ర లోన్ యాప్స్ నుంచి రూ.2 వేలు లోన్ తీసుకుని కొంత డబ్బులు తిరిగి చెల్లించాడు. అయినా సరే ఇంకా అధిక మొత్తంలో డబ్బులు చెల్లించాలని అవతలివారు వేధించడంతో మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధితుని భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించారు. గూగుల్ నుంచి వచ్చిన సమాచారం, బ్యాంక్ స్టేట్‌మెంట్ ఆధారంగా చనిపోయిన వ్యక్తి లోన్ తీసుకున్న డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయో విచారణలో తేల్చారు. పాకిస్థాన్ కేంద్రంగా ఈ ముఠా నడుస్తున్నట్టు గుర్తించారు. సుమారు భారత్ నుంచి 9 వేల మంది బాధితులు ఈ ముఠా చేతిలో మోసపోయినట్టు విశాఖ సిపి తెలిపారు. తదుపరి విచారణలో ఈ కేసులో ప్రధాన నిందితునితో పాటు మరో 9 మందిని అరెస్టు చేశారు. 18 మొబైల్ ఫోన్లను, ఒక ల్యాప్ టాప్‌ను, 54 సిమ్ కార్డులు, 60 లక్షల రూపాయల నగదును ఫ్రీజ్ చేశారు. ఈ ముఠా సభ్యులు ఆన్‌లైన్‌లో ఎలాంటి హామీ లేకుండా తక్కువ మొత్తంలో సులువుగా లోన్లు ఇస్తూ అధిక వసూళ్లకు పాల్పడుతోందని గుర్తించారు.

మోసం జరిగే తీరిదీ..

ఈ ముఠా సభ్యులు సోషల్ మీడియాలో ప్రకటనలు ఇస్తుంటారు. వాటిపై క్లిక్ చేసిన వెంటనే ఆ ఫోన్‌లోని కాంటాక్ట్స్ సైబర్ నేరగాళ్ల చేతికి వెళ్లేవి. అనంతరం వారి వ్యక్తిగత సమాచారం అంతా తీసుకుని కొంత మొత్తం అప్పుగా ఇచ్చేవారు. తీసుకున్న అప్పు చెల్లించినప్పటికీ ఇంకా తమకు అందలేదని చెప్పేవారు. ఎదుటవారిని బ్లాక్ మెయిల్ చేయడంతో పాటు ఫోన్‌లోని రుణగ్రస్తుని కాంటాక్ట్స్‌లోని బంధువులకు, మిత్రులకు అసభ్యకర సందేశాలు, ఫొటోలు పంపేవారు. వారినీ డబ్బులు చెల్లించాలని వేధించేవారు. ఇప్పటి వరకూ ఈ ముఠా సభ్యులు సుమారు రూ.200 కోట్ల లావాదేవీలు జరిపినట్టు పోలీసులు గుర్తించారు. అమాయకులే వీరి టార్గెట్‌గా ఉండేవారని విశాఖ సిపి తెలిపారు. ఖాతాదారులకు తెలియకుండా వారి ఖాతా వివరాలు సేకరించడం, వారికి తెలియకుండానే లావాదేవీలు నడిపించడం ఇప్పుడు సైబర్ నేరగాళ్ల కొత్త ట్రెండ్ అని అన్నారు. అమాయకులకు కమీషన్ల ఆశచూపి వారి ధ్రువపత్రాలను ఉపయోగించి బ్యాంకు ఖాతాలు తెరిపించి మరీ మోసాలకు పాల్పడుతున్నారన్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బులను దాచుకునేందుకు మ్యూల్ ఖాతాలు అమాయకుల చేత తెరిపిస్తున్నారని, మధ్యవర్తులను నియమించుకొని కమీషన్లు ఇస్తూ ఖాతాదారులకు తెలియకుండా లావాదేవీలు కొనసాగిస్తున్నారని వెల్లడించారు.

కెజిహెచ్ సముదాయాన్ని పరిశోధనా కేంద్రంగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి - విశాఖపట్నం : విశాఖలోని కెజిహెచ్‌ను ఢిల్లీ ఎయిమ్స్ తరహాలో తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 26న విశాఖ వేదికగా ఇచ్చిన హామీపై రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ హర్షం వెలిబుచ్చారు. అదే సమయంలో కెజిహెచ్, ఆంధ్రా మెడికల్ కాలేజీ సముదాయాన్ని ఉత్తరాంధ్ర పరిశోధనా కేంద్రంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ మేరకు సిఎంకు ఆదివారం లేఖ రాశారు. ఆ వివరాలను మీడియాకు వెల్లడించారు. కెజిహెచ్ 180 సంవత్సరాల క్రితం ప్రారంభించబడిన చారిత్రాత్మక సంస్థ అని గుర్తుచేశారు. అందులో రోగులకు అందిస్తున్న సేవలకు అనుగుణంగా కావాల్సిన సౌకర్యాలు లేవని తెలిపారు. దీంతో ఆసుపత్రి వద్ద నిత్యం రద్దీ వాతావరణం కనిపిస్తోందని పేర్కొన్నారు. పేద ప్రజలు ప్రైవేటు ఆసుపత్రుల ఖర్చులను భరించలేరని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు ప్రైవేటు ఆసుపత్రులలో ఉచితంగా సౌకర్యాలు లభించే అవకాశం ఉన్నా వారు అటువంటి ఆసుపత్రుల్లో అదనంగా ఉండే ఖర్చులను భరించాల్సి వస్తోందన్నారు.